క్లుప్తంగా

వీధి లైట్ల ఏర్పాటు



తెలుగు వాడలో స్తంభాలకు వీధి లైట్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం వీధి లైట్లను బిగించినట్లు పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి తెలిపారు. సెంట్రల్ ప్రత్యేక ఫండ్ నుంచి వచ్చిన 15 ప్రత్యేక పెద్ద బల్బులు గ్రామంలోని ప్రధాన వీధులతో పాటు అవసరమున్న చోట ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో అవసరాన్ని బట్టి వీధిలైట్లను మంజూరు చేయాలని అధికారులను కోరనున్నట్లు ఆమె తెలిపారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి



కెరవెళ్లి పాఠశాలలో సమ్మర్ క్యాంపులో ఎంఈఓ సాయిరెడ్డి తదితరులు

పూడూరు: విద్యార్థులు సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని పూడూరు మండల విద్యాధికారి సాయిరెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని దేవనోనిగూడ, కెరవెళ్లి పాఠశాలలో శిక్షణ పౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో పది రోజుల పాటు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికితీసేలా సమ్మర్ క్యాంపు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సంతోష్, షహనాజ్, శిక్షణ పౌండేషన్ మెంటార్ రాకేశ్, సీఆర్పీలు గాలయ్య, జంగయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

అంగన్‌వాడీల యూనియన్ జిల్లా కార్యదర్శి భారతి



డీపీఓకు సమ్మె నోటీస్ అందిస్తున్న అంగన్‌వాడీలు

అనంతగిరి: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని యూనియన్ జిల్లా కార్యదర్శి భారతి పేర్కొన్నారు. ఈ మేరకు ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో గురువారం వికారాబాద్ జిల్లా మహిళా సంక్షేమ అధికారి జయసుధకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీస వేతనాలు రూ.32వేలు ఇవ్వాలన్నారు. అదనపు పనులు కేటాయించొద్దన్నారు. ఐసీడీఎస్‌ను పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మి, యాదమ్మ, స్వరూప, పెంటమ్మ, సునంద, రాణి తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం



మాట్లాడుతున్న అలిముద్దీన్

ధారూరు: మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని జిల్లా మానవ అక్రమ రవాణ నివారణ విభాగం హెడ్‌కానిస్టేబుల్ అలిముద్దీన్ పిలుపునిచ్చారు. బుధవారం ధారూరు మండల పరిధిలోని కేరెళ్లి గ్రామ శ్రీసత్యసాయి సార్వజనిక కేంద్రంలో నిర్వహిస్తున్న బాలవికాస్ వేసవి శిబిరాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన పిల్లలకు, మహిళలకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు అనుమానంగా సంచరిస్తుంటే 100కు డయల్ చేయాలని సూచించారు. తెలియని వారు ఏదైన తినడానికి ఇస్తే తీసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సార్వజనిక కేంద్రం సభ్యులు రాజేందర్‌రెడ్డి, నర్సింహులు, సాయి, బాలవికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

షాబాద్ ప్రత్యేకాధికారిగా డాక్టర్ బాబుబేరీ

షాబాద్: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా వెటర్నరీ, పశుసంవర్ధక అధికారి డాక్టర్ బాబుబేరీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా షాబాద్ మండల కార్యాలయంలో ఆయనకు అధికారులు స్వాగతం పలికి సన్మానించారు.

ఎన్కేపల్లి రోడ్డుకు మోక్షం కలిగేనా?

కంకర వేసి వదిలేసిన కాంట్రాక్టర్
- ఎనిమిదేళ్లు గడిచినా బీటీ పనుల్లో నిర్లక్ష్యం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



ఎన్కేపల్లిలో కంకర వేసి వదిలేసిన రోడ్డు

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఎన్కేపల్లి రోడ్డుకు గుంతలు పడటంతో అప్పటి ప్రభుత్వం రూ.26లక్షలు మంజూరు చేసింది. ఏడాది క్రితం వరకు రోడ్డు వేయలేదు. కానీ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఒక కల్వర్టు నిర్మించారు. రోడ్డు తవ్వి కంకర వేసి వదిలేశారు. బీటీ వేయకుండానే వదిలేశారు. దీంతో గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి 2కిలోమీటరు వరకు ఎన్కేపల్లి పంచాయతీ రాజ్ రోడ్డు ఉంది. 2013లో కిలోన్నరమీటరు రోడ్డును బీటీగా మార్చారు. ఇంక అర కిలోమీటరు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో 8సంవత్సరాల క్రితం అర కిలోమీటరు రోడ్డు, ఒక కల్వర్టు నిర్మాణానికి రూ.26లక్షలు మంజూరు చేశారు. అప్పటి నుంచి ఏడాది క్రితం వరకు టెండర్లు వేసినా ప్రతి కాంట్రాక్టరు పని చేయకుండానే వెళ్లిపోతున్నారు. ఏడాది క్రితం ఒక కాంట్రాక్టరు వచ్చి కల్వర్టు నిర్మించి, రోడ్డును తవ్వించారు. కంకర వేయించి బీటీ వేయకుండానే వెళ్లిపోయాడని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2013లో వేసిన బీటీ రోడ్డు కూడా పూర్తిగా గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని వాహనాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆ రోడ్డుకు బీటీ వేసేందుకు నిధులు మంజూరు కాగా టెండరు దశలో ఉంది. వీర్లపల్లి, సిరిపురం, కోత్లాపూర్, మర్పల్లి, బూచన్‌పల్లి, పట్లూరు తదితర గ్రామాల నుంచి వికారాబాదుకు వెళ్లాలంటే ఎన్కేపల్లి మీదుగానే వెళ్తారు. దీంతో వాహనాదారులు కంకరరోడ్డుపై ప్రయాణం చేయాలంటే ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు కిలోమీటర్ మేర గుంతలు పడటంతో ప్రయాణం..నరకప్రాయంగా మారిందని చెబుతున్నారు. ఈ విషయంలో ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రెండు కిలో మీటరు వరకు పూర్తిగా బీటీ వేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

త్వరలో బీటీ వేయిస్తాం

కంకర వేసిన అర కిలోమీటరు రోడ్డుకు త్వరలో బీటీ వేయిస్తాం. కాంట్రాక్టరుతో మాట్లాడి వెంటనే పనులు చేపడుతాం. కిలోన్నరమీటరు రీ బీటీకి నిధులు మంజూరయ్యాయి. పనులకోసం త్వరలో టెండరు వేస్తాం. అనంతరం పనులు చేపడుతాం.

– ప్రణీత్‌కుమార్, ఏఈఈ, మోమిన్‌పేట

బ్యాంకు రుణాలు వినియోగించుకోవాలి

మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్



మహిళా సంఘాలకు చెక్కు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్

అనంతగిరి: మహిళా సంఘాలు బ్యాంకులిచ్చే రుణాలు సద్వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం వికారాబాద్ యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు రుణాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ యూనియన్ బ్యాంక్ శాఖలు మహిళా సంఘాలకు చెందిన రూ.6.48కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. తీసుకున్న రుణాలను చెల్లించి, మరిన్ని రుణాలు తీసుకొని ఆర్థికంగా ఎదగాలని యూనియన్ బ్యాంకు మహబూబ్‌నగర్ రీజినల్ డిప్యూటీ హెడ్ మురళీకృష్ణ పేర్కొన్నారు. తమ ఖాతాదారులకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నాయన్నారు. వ్యవసాయ రుణాలను తమ బ్యాంకు ప్రోత్సహిస్తుందన్నారు. ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఏరియా ప్రతినిధులు రాజేష్‌బాబు, అల్లబక్స్, వికారాబాద్ బ్యాంక్ మేనేజర్ నర్సప్ప, డీపీఎం నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కుల్కచర్లలో క్రికెట్ టోర్నీ

కుల్కచర్ల: నేటి నుంచి కుల్కచర్ల మండల కేంద్రంలో డబల్ వికెట్ క్రికెట్ టోర్నీని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రవికుమార్, రమేష్, తిరుపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివేకనంద కళాశాల వెనుకాల గల గ్రౌండ్‌లో ఈ టోర్నీని నిర్వహిస్తారని పేర్కొన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ రూ.5వేలు అందజేస్తారని వివరించారు. మరిన్ని వివరాలకు 9959906881, 9951507890 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ



విగ్రహాలు ప్రతిష్ఠించిన మారెమ్మ, సేవాలాల్ ఆలయం

బొంరాస్‌పేట: మండల పరిధిలోని మూడు మామిళ్లతండా పంచాయతీ దీప్లానాయక్ తండాలో మూడోరోజు గురువారం మారెమ్మ, సేవాలాల్ మహరాజ్ ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు పూజారి రేవల్లి వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో మారెమ్మ, సేవాలాల్ విగ్రహాలను ప్రతిష్ఠించి అన్నదానం చేపట్టారు. రాత్రి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చందర్‌నాయక్, జయరాం, గోపాల్, మాజీ సర్పంచు బద్యానాయక్, సక్రియానాయక్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ల తొలగింపుపై ఫిర్యాదు

షాద్‌నగర్: పట్టణంలోని సీఎస్‌కే వెంచర్‌లో ఉన్న డివైడర్లు, చెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం పలువురు కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ సునితకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కాలనీ అభివృద్ధి పేరుతో కొందరు డివైజర్లు, చెట్లు తొలగించారని పేర్కొన్నారు. కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాల్సింది పోయి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే నష్టం జరుగుతుందని ఆరోపించారు. ఆ వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, ఈ విషయమై ఆర్డీఓ సరిత, తహసీల్దార్ పార్థసారధికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు కాలనీవాసి హరిభూషణ్ పటేల్ తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



వెంకటేశంను సన్మానిస్తున్న నాయకులు

తాండూరు టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మారక జాతీయ పురస్కార్ అవార్డు గ్రహీత పసుపుల వెంకటేశంను పలువురు గురువారం సన్మానించారు. ఐదేళ్లుగా భగవద్గీత పారాయణం చేస్తూ, చిన్నారులకు గీతను బోధిస్తూ, ఆధ్యాత్మిక సేవారంగంలో కృషి చేస్తున్నందుకు పుడమి సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఇటీవల ఆయనకు పురస్కారాన్ని అందజేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, తాండూరు సిద్దార్థ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్‌తో పాటు తాండూరు ప్రైవేట్ లెక్చరర్స్ ఫోరం సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భగవద్గీత పారాయణంతో పాటు చిన్నారుల్లో ఆధ్యాత్మికత భావనలను పెంపొందించడంలో వెంకటేశం చేస్తున్న కృషిని అభినందిస్తున్నట్లు తెలిపారు.

స్నేహితుడికి చేయూత



హనుమయ్యకు స్కూటీని అందిస్తున్న సత్యనారాయణరెడ్డి, పూర్వ విద్యార్థులు

చేవెళ్ల: దివ్యాంగుడైన స్నేహితుడికి స్కూటీ అందించి దాతృత్వం చాటుకున్నాడు రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి. మున్సిపాలిటీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం నాలుగు చక్రాల స్కూటీని దివ్యాంగుడైన స్నేహితుడు హనుమయ్య దంపతులకు ఆయన అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని నెలల క్రితం చేవెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1980–81 బ్యాచ్ విద్యార్థులందరం కలిసి నిర్వహించుకున్న సమ్మేళనంలో తమతో పాటు చదువుకున్న అల్లవాడ గ్రామానికి చెందిన కావలి హనుమయ్య దివ్యాంగుడు కావడంతో అతడికి సహాయం చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు. అతడి అవసరం గుర్తించి సొంత డబ్బులతో స్కూటీ అందజేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం అతడికి 1లక్ష 30వేల రూపాయలతో కొత్త స్కూటీని కొనుగోలు చేసి తమ పూర్వ విద్యార్థుల సమక్షంలోనే ఆలయం వద్ద పూజలు చేయించి హనుమయ్య దంపతులకు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సేవాగుణాన్ని తోటి విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విజయ్ కుమార్, సంతోష్ గుప్తా, యాదయ్య, ఖాజాపాష, రాములు, శంకరయ్య, ప్రభులింగం, మల్లయ్య, వెంకటయ్య, జనార్దన్, గోపాల్, మాజీ ఎంపీటీసీలు రాములు, చంద్రయ్య, మహేశ్వర్‌రెడ్డి, నాయకులు రాఘవులు, అరుణ్, అంజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

కొడంగల్ రూరల్: కేంద్ర కార్మిక సంఘాలు, స్వాతంత్ర ఫెడరేషన్ల అసోషియేషన్ల పిలుపు మేరకు మే 20వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య కోరారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్‌కు మున్సిపల్ కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. సమ్మెకు సంబంధించిన డిమాండ్లను వినతిపత్రంలో పేర్కొన్నారు. స్థానిక సంస్థలకు నిధులు కేటాయించాలని, కనీస వేతనం రూ.26వేలు చేయాలని, నాలుగు లేబర్‌కోడ్లను వెంటనే రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేస్తూ కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పిస్తూ 8గంటల పనిదినాన్ని అమలు చేయాలని, తెలంగాణ రాష్ట్ర రెండవ పీఆర్సీలో కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని, పెరుగుతున్న పట్టణ విస్తరణకు అనుగుణంగా కొత్త సిబ్బందిని నియమించాలని తదితర డిమాండ్ల సాధన కోసం చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పకీరప్ప, ఉపాధ్యక్షుడు మొగులప్ప, కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శులు మహేష్, వెంకటలక్ష్మి, సుగుణమ్మ, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్



లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న ఆంజనేయులు ముదిరాజ్ తదితరులు

కుల్కచర్ల: సీఎం సహాయనిధి పేదలకు వరమని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలో అనారోగ్యానికి గురై వివిధ ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్న లాల్‌సింగ్ తండాకు చెందిన చందర్ నాయక్‌కు రూ.34వేలు, ఎర్ర గోవింద్ తండాకు చెందిన సునీతజయరాంకు రూ.7,500, జీతుల తండాకు చెందిన నీల్యానాయక్‌కు రూ.51వేలు మంజూరైన చెక్కులను వారి కుటుంబీకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిరుపేద బడుగు, బలహీనవర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో లేని వైద్య సదుపాయాలను ప్రయివేటులో చికిత్స చేయించుకునేందుకు ఈ సీఎం సహాయనిధి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మార్కెట్ కమిటీ డైరక్టర్ భరత్‌కుమార్ రెడ్డి, నాయకులు గోపాల్ నాయక్, విష్ణునాయక్, తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు ఇబ్బందులు రానీయొద్దు

ఎంపీడీఓ గ్యామా



బొంపల్లిలో ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గ్యామా

దోమ: ఉపాధిహామీ కూలీలకు ఎలాంటి ఇబ్బందులు రానీయొద్దని ఎంపీడీఓ గ్యామా తెలిపారు. గురువారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీలో క్రమం తప్పకుండా కూలీలకు 100 రోజులు పని కల్పించేలా ఫీల్డ్ అసిస్టెంట్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పని ప్రదేశంలో మంచినీరు, ఫస్ట్‌ఎయిడ్‌కిట్లు, చలువ పందిళ్లు వేయించేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. మస్టర్లు ఎప్పటికప్పుడు రాయాలన్నారు. చేసిన పనికి వేతనం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

పండించిన ప్రతీ గింజను కొంటాం



కుల్కచర్ల: కుస్మసముద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుల్కచర్ల: రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండలం కుస్మసముద్రం గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పాయిపల్లి, తిర్మలాపూర్ వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వమే నేరుగా రైతుల ధాన్యాన్ని సేకరించడంతో పాటుగా మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందన్నారు. సన్నరకానికి రూ.500ల బోనస్ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్ కుమార్ రెడ్డి, లక్ష్మయ్య, బాబు, కేశవులు, శ్రీరామ్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బంట్వారం: జొన్న పంట సాగు చేసిన రైతులందరు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోట్‌పల్లి ఏఓ కరుణాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని మర్పల్లిలో ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రతీ ఎకరాకు 14 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3,371 చెల్లించనున్నట్లు ఆయన వివరించారు. పంట సాగు నమోదు ఆధారంగా రైతులు ఏఈఓల దగ్గర రశీదు తీసుకుని కొనుగోలు కేంద్రాలకు వెళ్లాలని ఆయన సూచించారు.

అర్హులందరికీ ఇళ్లు అందించాలి

సాంస్కృతిక శాఖ జిల్లా కో కన్వీనర్ నరేందర్‌రెడ్డి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందించాలని సాంస్కృతిక శాఖ జిల్లా కోకన్వీనర్ కర్రెడ్ల నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత పాటించాలని కోరుతూ ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలోని అన్ని పార్టీల నాయకులతో ఇందిరమ్మ కమిటీలు వేస్తామని తెలిపి కాంగ్రెస్ నాయకులతోనే వేశారన్నారు. ఈ కమిటీ కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే ఇళ్లను అందించేందుకు కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి పార్టీలతో సంబంధం లేకుండా అందించాలని ఆయన కోరారు. అర్హులైన వారికి ఇళ్లను మంజూరు చేయకుంటే మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మోటే శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, వీరేందర్‌నాయక్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

చేవెళ్ల: బీజేపీ చేవెళ్ల మండల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మున్నూరు శ్రీకాంత్‌ను ఆ పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఆయనను కలిసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు కృష్ణగౌడ్, వెంకట్రామిరెడ్డి, నాయకులు కృష్ణమోహన్, కరుణాకర్ ఉన్నారు.

మిషన్ భగీరథ నీరు వృథా!

పైపులు పగిలితే పట్టించుకోరా?
- హంసంపల్లి శివారులో వారం రోజులుగా పోతున్న నీరు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



హంసంపల్లి సమీపంలో పైపులైన్ పగిలిపోవడంతో వృథాగా పోతున్న నీరు

దుద్యాల్: మండలపరిధిలోని హంసంపల్లిలో మిషన్ భగీరథ పైప్‌లైన్లు పగలడంతో తాగేనీరు వృథా అవుతుంది. తాగునీరు సక్రమంగా సరఫరా కాకపోతే గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రతరం అవుతుంది. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. హంసంపల్లిలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడంతో తాగేనీరు వృథాగా పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి పుష్పలతను వివరణ కోరగా రోడ్డు మరమ్మతు పనులు నిర్వహిస్తునందునా రోడ్డు కోసం తవ్వుతుండగా పైపులైన్లు పగులుతున్నాయన్నారు. దీంతో గ్రామానికి నీటి సరఫరా చేయడంలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. పగిలిన ప్రతీ సారి మరమ్మతులు చేయిస్తూ గ్రామానికి నీటి సరఫరా అందించేవారమని గుర్తు చేశారు. పైపులైన్లు పగిలిన ప్రతీసారి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేయలంటే కావాల్సిన నిధులు లేక తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. వారం రోజులుగా నీరు వృథాగా పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామ పంచాయతీ అధికారులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మరమ్మతుల కారణంగా వారంలో రెండు నుంచి మూడు రోజులు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గ్రామస్థులు వాపోయారు. ఏదేమైన పైపులైన్ మరమ్మతులలో మిషన్ భగీరథ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు.